"హలో! సవితగారా? ఏమిటి .... మీ రిక్కడ ..... ఇలా? పైగా ఒంటరిగా?"

పలకరించిన వ్యక్తికేసి తేరిపార చూశాను. స్ఫురద్రూపి. అందగాడు. నన్ను చూసి సవిత అనుకున్నాడు పాపం. నవ్వుతూ చూశాను.

"నేను సవితను కాను. వాళ్ల సిస్టర్ కవితను!" అన్నాను.

అతను తొట్రుపడ్డాడు. "సారీ, సవితలా ఉంటేనూ ..." అని క్షమాపణలు చెప్పబోయాడు.

"చెప్పానుగా, సవిత చెల్లెల్ని. పార్టీలో ఇమడలేక ఇలా వచ్చి కూర్చున్నాను."

అతను ఇంకా ఆశ్చర్యం నుంచి కోలుకోవటంలేదు. "మీరు కవలలా?"

"కాదు. నాకంటె రెండేళ్లు పెద్దది. అయినా ఇద్దరం ఇంచుమించు ఒకేలా ఉంటాం. కానీ సవిత అభిరుచులు వేరు, నావి వేరు. సరేనా?" అన్నాను కాస్త విసుగు ప్రదర్శిస్తూ.

"సారీ .... సారీ, మీరు చికాకు పడుతున్నట్టుంది. ఎంగేజ్‌మెంటు పార్టీ సవితగారిదే కదా, ఆవిడే ఇలా విడిగా కూర్చోవడమేమిటనిపించి .... సరే, సరే ..... ఇప్పుడర్థమైందిగా. ఇంక అడగనులెండి. మీరు ఎక్కడుంటారు? ఎప్పుడొచ్చారు?" అతను తికమక పడుతూ మాట్లాడుతూంటే నాకు భలే సరదాగా అనిపించింది.

"మా నాన్నగారితోపాటు విజయవాడలోనే ఉంటాను. సవితలా నాకు సినిమా ధ్యాస లేదులెండి. లేకపోతే నేనూ హైదరాబాదుకి జెండా ఎత్తేసి ఉండేదాన్ని. నిన్ననే వచ్చాను. తోడుపెళ్లికూతురిగా నేను ఉండకపోతే తప్పదని సవిత పట్టుబట్టడంతో కదిలి రావలసి వచ్చింది."


"అంటే .... మీ పేరెంట్సు సవితగారి పెళ్లికి ఒప్పుకున్నట్టేనా?" అతని గొంతులో నిరాశ ధ్వనించింది.

"పేరెంట్స్ ఇంటే నాన్నగారొకరేగా. అమ్మ పోయి ఐదేళ్లయింది. సవిత సినిమాల్లోకి వెళ్లడమే నాన్నగారికి నచ్చలేదంటూ ఉంటే సినిమా మనిషితో పెళ్లికెలా ఒప్పుకుంటారండీ?" అని అన్నానే గానీ, ఈయనా సినిమా తాలూకు మనిషేమోనని అనుమానం వచ్చింది. వెంటనే, "సారీ, మీరూ ఈ లైనులోనే ఉన్నట్టున్నారు. నాన్నగారు కాస్త పాతకాలం..." అని సర్దుకోబోయాను.

"ఏ కాలం అయినా అభిప్రాయాలు అభిప్రాయాలేలెండి. నేను సినిమా లైను

ఎమ్బీయస్ ప్రసాద్

# నిత్య పెళ్లికొడుకు కొత్త వధువు



కాదు కానీ, దానికి దగ్గర లైనే! ఎడ్వర్టయిజింగ్ లైను. సవిత నా దగ్గిరే మోడలింగ్ చేసింది. తన కెరీరు నాతోనే ప్రారంభమయింది. నా పేరు మహేష్. సవిత మీకు చెప్పే ఉంటుంది. మోడలింగ్‌లో పేరు రావడంతో తర్వాత సినిమా మోజులో పడిపోయింది."

"ముందునుంచీ దానికి సినిమాపై వ్యామోహం ఉందిలెండి. మోడలింగ్ ద్వారా సినిమాల్లోకి అడ్డదారిలో దూరవచ్చని మోడలింగ్ చేసి ఉంటుంది!" అన్నాను.

"అబ్బే ...! నేను ఇలా అంటున్నానని కాదు. మా ఇద్దరి మధ్యా మంచి దోస్తీ ఉండేది. మోడలింగ్‌లోనే స్థిరపడతానని అంటూ ఉండేది. ఇప్పుడు సడెన్‌గా ఆ వైకుంఠరావును పెళ్లి చేసుకుంటానంటోంది. సినిమాలకు డైరక్షన్ బాగానే చేసేవాడు. ఇప్పుడు అదీ లేదులెండి. అంతమాత్రాన పెళ్లాడేయడమే!"

"మీరు వద్దని చెప్పలేకపోయారా?"

"చెప్పాను. నువ్వు అసూయతో చెప్తున్నావంది. వీడు కాకపోతే వేరే ఎవరైనా ఫర్వాలేదన్నాను. వినదే! వీడి దగ్గర డబ్బుందనుకోండి, అంతమాత్రంచేత పోయి, పోయి వాణ్ని పెళ్లాడడమా? మీ నాన్నగారైనా చెప్పవచ్చు కదా అనుకున్నాను."

"సవిత ఎప్పుడైతే మోడలింగ్‌కి వెళ్తానందో ఆ రోజు నుంచే దాన్ని కూతురుగా పరిగణించడం మానేశారు. ఆస్తిలో ఒక్క చిల్లిగవ్వ ఇవ్వనన్నారు!"

"కానీ, సవిత సినిమా తీస్తానన్నప్పుడు డబ్బిచ్చారుగా?"

"ఇవ్వలేదు. తనే లాక్కుంది. పేచీ పెట్టింది. కోర్టుకెళ్తానంది. ఇక లాభం లేదని, చట్టప్రకారం దానికి ఎంత రావాలో అంతా ఇచ్చేశారు నాన్నగారు. అమ్మ ఎలాగూ లేదు. తక్కినదంతా నా పేర రాసేశారు!"

"అంటున్నానని అనుకోకండి .... అక్కడే మీ నాన్నగారు పొరబాటు పడ్డారు. కోర్టుకెళ్లమనాల్సింది. ఆ సినిమా ప్రొడక్షనైనా వాయిదా పడేది!"


"వాయిదా పడితే ఏం లాభం? సినిమా రిలీజై బాగానే ఆడిందిగా!"

"చూడండి, కవితగారూ! ఈ పాటికే మీరు గ్రహించి ఉంటారు. నేను మీ అక్కకు హితైషిని. మీకు నిజానిజాలు తెలియవు. ఎక్కడో దూరంగా ఉంటారు. జరిగిందేమిటంటే సవిత సినిమాల్లోకి వస్తూనే హీరోయిన్ అయిపోదామనుకుంది. కానీ ఏవో చెల్లెలు వేషాల్లాటివి నాలుగైదు వచ్చాయి. ఎలాగైనా హీరోయిన్ అనిపించుకోవాలని స్వంతంగా సినిమా తీసింది. సినిమా బాగా ఆడలేదు. కానీ నిజం బయటకు వస్తే హీరోయిన్‌గా మార్కెట్ బిల్డప్ పోతుందని పబ్లిసిటీకి బాగా ఖర్చు పెట్టి, సినిమా బలవంతంగా ఆడించింది. దానివల్ల నష్టం మరింత పెరిగింది."

నేను ఆశ్చర్యపోయాను. అక్క తీసిన సినిమా బాగా ఆడటం వల్లనే ఆ సినిమా డైరెక్టరు - వైకుంఠరావును చేసుకుంటోందని అనుకుంటున్నాను నేను. వాళ్లిద్దరూ సక్సెస్‌ఫుల్ డైరెక్టరు హీరోయిన్ జంటగా వెండి తెరమీద వెలుగొందుతారని అంచనాలు వేశాను. మరి అంత ఫ్లాప్ సినిమా తీసిన వాడిలో ఏం చూసిందో మరి. అదే పైకి అనేశాను అప్రయత్నంగా. మహేష్ వెంటనే స్పందించాడు.

"అదేనండీ నా గోలానూ! వాడి డైరెక్షన్ హోప్‌లెస్. తక్కిన వాళ్లందరి చేతా పనిచేయించి వాడి పేరు వేసుకుంటాడు. అంతేకాదు, ఇంకో విషయం చెప్పనా? వాడు నిత్యపెళ్లికొడుకు. ఎవత్తినో పెళ్లి చేసుకుని, తర్వాత దాన్ని చంపేసి, దాని ఆస్తి కాజేసి మళ్లీ ఇంకొత్తిని పెళ్లి చేసుకుంటూంటాడు. అటువంటివాడి వలలో పడింది సవిత. అందుకే నేను చాలా ఇదవుతున్నాను."

మహేష్ చెప్తూంటే నాకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఇదంతా నిజమా? అలా అయితే అక్క వాణ్ని ఎందుకు చెసుకుంటున్నట్లు? సినిమావాళ్లంటే రొమాంటిక్ వ్యవహారాలు నడుపుతారని అందరం అనుకుంటాం. నిజమైనా, కాకపోయినా. కానీ ఇదేమిటి? బొత్తిగా .... అన్ని పెళ్లిళ్లా? ఆ తర్వాత భార్యను చంపేయడమా? మై గాడ్!



మనసు వికలం అయిపోయింది. కుటుంబంతో అన్ని బంధాలూ తెంపేసుకున్న సవిత నన్ను తోడుపెళ్లికూతురుగా రమ్మనమని బలవంత పెట్టడమేమిటి? ఎంగేజ్‌మెంటు పార్టీ అంటూ ఇంత ఘనంగా వేడుకలు చేసుకుంటూంటే నా ఖర్మకాలి ఒంటరిగా వచ్చి ఈ పెద్దమనిషి పాలబడటమేమిటి? ఇతను చెప్పినవి విని మనస్సు పాడుచేసుకోవడమేమిటి? అసలివన్నీ నిజాలో, అబద్ధాలో!? నా అనుమానం ఈ మహేష్ సవితను ప్రేమించి ఉంటాడు. తన గుప్పిట్లోనే ఉంటుందని, పెళ్లి చేసుకుంటుందనీ కలలు కని ఉంటాడు. కానీ సినిమా ఛాన్స్ వచ్చి సవిత పైకి వెళ్లిపోవడంతో ఆశలు భగ్నమైపోయి ఈ విధంగా దుష్ప్రచారం చేస్తున్నాడేమో!

నా ఆలోచనలు చదివేసినట్టున్నాడు. "నేను అబద్ధం

చెబుతున్నాననుకుంటున్నారు కదూ! వైకుంఠరావు గురించి ఎవర్ని అడిగినా చెప్తారు. పేపర్లో కూడా వేశారు. కేసు నడిచిందిగా. చివర్లో ఏదో మేనేజ్ చేసి, బయటపడ్డాడు. సవితకు చెప్పాను ఇవన్నీ. అయినా తను అతన్నే పెళ్లి చేసుకుంటానని పట్టుబట్టింది. అలాంటి మనిషితో కలిసి జీవించడం అంటే భయమేయదూ?"

నేను చిరునవ్వు నవ్వాను. "మా సవిత చాలా ధైర్యస్థురాలులెండి! ఎడ్వంచరంటే ఎప్పుడూ సై అంటుంది!"

"అసలు వాణ్ని మీరు చూశారా? ఎంత అసహ్యంగా ఉంటాడో .... వయస్సు కూడా చాలా ఎక్కువ. పెళ్లి మీద పెళ్లి చేసుకుని ఈ వయస్సు వాడయ్యాడు. వాడిలో ఏం చూసి ...."

"మహేష్‌గారూ! ఆడవాళ్లను మీరు అర్థం చేసుకోలేరు. అటువంటివాళ్లంటే కూడా ఆకర్షింపబడతారు స్త్రీలు. పదిమంది ఆడవాళ్లతో తిరుగుతాడు అని పేరుబడ్డవాళ్లంటే కూడా మోజు పడే ఆడవాళ్లున్నారు. వాడిలో ఏం చూసి అంతమంది వెంటపడ్డారన్న కుతూహలంతో వీళ్లు కూడా తిరుగుతారు. మోజున్న చోట వయస్సు, అందం .... ఇవన్నీ లెక్కలోకి రావు. పరిస్థితులు అనుకూలించకగానీ, లేడీస్ ఆల్‌సో వాంట్ టు లివ్ డేంజరస్‌లీ!"

"ఫెటాలిస్టిక్ మెంటాలిటీ అంటారు అలాంటిదా? మీరు చెప్పినదీ నిజమే. మానియాక్‌ల వలలో చిక్కే ఆడవాళ్లు ఎంతోమంది ఉంటారని చదువుతూనే ఉంటాం. మంచివాళ్లకి ఈ రోజుల్లో డిమాండు లేదులెండి!" అన్నాడు సగం సీరియస్‌గా, సగం సరదాగా.

000

"ఏమిటే, మీ మహేష్ మంచివాడనేనా దూరంగా పెట్టావు?" అన్నాను సవితతో మర్నాటి పొద్దున కాఫీలవేళ.

"నిన్న రాత్రి పార్టీలో గంటసేపు కనబడకుండా పోయావు. మహేష్‌తో కబుర్లు చెబుతూ కూర్చున్నావా? మతిలేదా? ఏమంటాడు బోరుగాడు?" అంది సవిత జుట్టు వెనక్కి తోసుకుంటూ.

"నా ప్రశ్నకు సమాధానం చెప్పు!"

"సమాధానం ఏముంది? నాకు నచ్చే లక్షణాలు అతనిలో లేవు. నీకు నచ్చితే నువ్వు చేసుకో. అయినా నీకు సరిపోతాడులే. నీలాగే వాడు బుద్ధావతారం. దొందూ దొందే!"

"అతను చేసుకోవాలనుకున్నది నిన్ను ... నన్ను కాదు!" అన్నాను కోపంగా.

కాఫీ తాగడం అయిపోయినట్టుంది. "ఓ గంటలో వైకుంఠరావుగారు వస్తారు. మనందరం తెమిలి రిజిస్ట్రారు ఆఫీసుకి వెళ్లాలి. పెళ్లి చేసుకోవాలి. అక్కణ్నుంచి స్కైలైన్‌లో లంచ్‌కెళ్లాలి. ఇప్పుడు ఆ దద్దమ్మ మహేష్ డిస్కషన్ ఎందుకు? నువ్వు కూడా బాగా తయారవ్వు. కాస్త ఫ్లాషీగా ఉండే డ్రస్సు వేసుకో. హీరోయిన్ సవిత పెళ్లి ఫొటోలో - ఆమె సిస్టర్ అంటూ పత్రికల్లో ఫొటోలు వస్తాయి. నువ్వు అమ్మమ్మలా ఉంటే ఎలా?" అంటూ లేచి వెళ్లిపోయింది సవిత.

మహేష్ దద్దమ్మ అనుకోవడం పొరపాటు. మేం అందరం తయారై మేరేజ్ రిజిస్ట్రార్ ఆఫీసుకి వెళ్లబోతుండగా, మహేష్ దిగబడ్డాడు ఒక బక్కపలుచని పొట్టి మనిషిని వెంటబెట్టుకుని. అతన్ని చూడగానే వైకుంఠరావుగారు తెల్లబోయి, "చలమయ్య!" అన్నారు అప్రయత్నంగానే.

"అవును. చలమయ్యనే! నిన్ను ఉరికంబం ఎక్కించకుండానే రిటైరయ్యాను. అదే నా బాధ!" అన్నాడు పళ్లు నూరుతూ.

"ఏమిటి మహేష్! ఎవరితను?" అంది సవిత అసహనంగా.

మహేష్ నోరు విప్పేలోపున "నేను చెబుతాను. మద్రాసులో కొడంబాక్కం పోలీస్ స్టేషన్‌లో పనిచేసి రిటైరైన ఇన్‌స్పెక్టర్ని. మీ క్కాబోయే భర్త వైకుంఠరావుగారి చరిత్ర పూర్తిగా తెలిసినవాడిని. ఈ నిత్యపెళ్లికొడుకు మళ్లీ పెళ్లిపీటలెక్కుతున్నాడని మహేష్ చెబితే, ఓసారి హెచ్చరించి పోదామని వచ్చాను."

"ఎవరిని హెచ్చరించేది? నన్నా, సవితనా?" అన్నాడు వైకుంఠరావు ఉగ్రంగా.

"ఇద్దరినీ. ముఖ్యంగా నిన్ను. మళ్లీ ఏదైనా ప్రయత్నించావో వదిలిపెట్టను జాగ్రత్త! నేను రిటైరైనా డిపార్టుమెంటులో నా ఫ్రెండ్స్ ఇంకా చాలామంది ఉన్నారు!" అన్నాడు చలమయ్య.


"నువ్వు సర్వీసులో ఉన్నప్పుడు కూడా ఇలాగే వేధించావు. ఏం జరిగింది?" అన్నాడు వైకుంఠరావు వెక్కిరింతగా.

"చూశావా మహేష్, వీడి ధీమా? సవితగారూ! ఈయన చరిత్ర మీకు తెలుసో, లేదో... కొన్ని విశేషాలు చెబుతా వినండి!" అంటూ మొదలుపెట్టాడు చలమయ్య.

"1974. అప్పటికి మీరింకా పుట్టారో, లేదో! ఈ పెద్దమనిషికి అప్పటికే పెళ్లయింది. విజయవాడ నుంచి లేచిపోయి వచ్చిన అమ్మాయితో. పెళ్లయి ఆరునెలలు తిరక్కుండానే ఆ అమ్మాయి ప్రమాదంలో చచ్చిపోయింది. బాత్‌రూమ్‌లో జారిపడి తలకాయ బద్దలయింది. చచ్చిపోయేందుకు ముందే అమ్మాయి ఇన్సూర్ చేసింది. ఇన్స్యూరెన్స్ కంపెనీవాళ్లు కేసు పెట్టారు. సాక్ష్యం చాలలేదు. కేసు కొట్టేశారు. ఇన్స్యూరెన్స్ వాళ్ల డబ్బు ఇతను కొట్టేశాడు.

"1977. తమిళనాడులో పుదుక్కోట్టై నుంచి వచ్చిన అమ్మాయి. మళ్లీ అలాగే యాక్సిడెంటు. నిచ్చెన మీద నుంచి పడిపోయిందట. ఇన్స్యూరెన్స్ కట్టించడం, దాన్ని క్లెయిమ్ చేయడం. కేసు. సాక్ష్యం సరిపోలేదు."

"చూడు, సవితా! ఇతను తన ప్రమోషన్లకోసం ఏదో ఒక కేసు నా మీద బనాయించేవాడు. నా ఖర్మకొద్దీ మా ఇల్లు వీళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఉంది. యాక్సిడెంటు అయిన ప్రతిసారీ దాన్ని హత్య అని చెప్పి యాగీ చేయడం, చివరకు మొహం వేలాడేయడం ఇతనికి అలవాటైపోయింది!" అన్న



వైకుంఠరావు మాటల్ని పట్టించుకోకుండా చలమయ్య అప్పగిస్తూనే ఉన్నాడు.

"1979. తెనాలి అమ్మాయి. గ్యాస్ స్టవ్ ఏక్సిడెంట్‌లోనే పోయింది. ఇన్స్యూరెన్స్ పాలసీ లేదు. అవసరమే పడలేదు. ఆ అమ్మాయి పేర బోల్డంత ఆస్తి ఉంది.

"1985దాకా మళ్లీ పెళ్లి అక్కర్లేకపోయింది. తెనాలి అమ్మాయి ఆస్తి ఉందిగా. 85లో న ౹జన్‌గూడ్ అమ్మాయి. కరంట్ షాక్ కొట్టింది. చచ్చి బతికింది. కేసు పెట్టను, విడాకులిస్తే చాలంది. డబ్బు నష్టం!

"దాంతో 1986లోనే మళ్లీ పెళ్లి ప్రయత్నం. పాల్‌ఘాట్ అమ్మాయి. సినిమాలో ఛాన్స్ ఇప్పిస్తానంటూ గదికి పిలిచి బలాత్కారం చేశాడని కేసు. విత్‌డ్రా చేసుకుంటే పెళ్లి చేసుకుంటానని ఇతని బేరం. అక్కర్లేదంటూ జైలుకి పంపిందామె. ఫైనల్‌గా కేసు కొట్టేసినా అది తేలేలోపున 60 రోజుల కారాగారవాసం ..."

"చలమయ్యా! అదేగా పేపర్లలో సెన్సేషనల్ న్యూస్ అయింది. వైకుంఠరావు తన జుట్టు కూడా కత్తిరించాడని ఆ అమ్మాయి ఆరోపించింది?" అంటూ అందించాడు మహేష్.

"ఆ అమ్మాయే కాదు, అతని పాలబడిన ప్రతి అమ్మాయి జుట్టూ కత్తిరించాడితను. అదో రకమైన మానియా ఏమో. ప్రతి నేరస్తుడికీ మోడస్ ఒపరాండి ఉంటుంది. అదే అతన్ని పట్టిస్తుంది!" అని చలమయ్య మళ్లీ తన పాట అందుకోబోతూండగానే సవిత మొదలుపెట్టింది అచ్చు చలమయ్య స్టయిల్‌లోనే!

"1991 దాకా మళ్లీ ఏ పెళ్లి ప్రయత్నమూ లేదు. అప్పుడు చెంగల్పట్టు నుండి పారిపోయి వచ్చిన వివాహిత మహిళతో పెళ్లి. కారు ఏక్సిడెంట్‌లో మరణం. కేసు కొట్టేయడం ... తరువాత 1993లో విజయనగరం నుండి పెళ్లి పీటలమీద నుండి పారిపోయి వచ్చిన ...." అంటూ ఆపి, "చాలా? ఇంకా చెప్పనా?" అంది.

అందరం నోరు తెరుచుకుని ఉండిపోయాం. "మరి ఇన్ని తెల్సీ ...?" అన్నాను నేను కాసేపటికి, తరువాత ఇంకేమనాలో తెలియక.

"ఇవన్నీ నాకు ముందే తెలుసు. ఇంకో విషయం కూడా చెబుతున్నాను వినండి. ఇవాళే పెళ్లి కాగానే ఇన్స్యూరెన్స్ ఆఫీసుకెళ్లి పదిలక్షల పాలసీ ఒకటి తీసుకోబోతున్నాం. సరేనా? వైకుంఠరావుగారి గతం నాకనవసరం. నేను ఆయన్ని ప్రేమిస్తున్నాను. ఆయనతో కలిసి బతకదలుచుకున్నాను. అది గ్రహించి ఇక మీరు దయచేస్తే, మా పెళ్లి ఏర్పాట్లు మేం చూసుకుంటాం!" అంది సవిత నిబ్బరంగా.

పెళ్లి జరిగిన వారం రోజులైనా సవిత నన్ను కదలనివ్వలేదు. ఇక నేనే పట్టుబట్టి ప్రయాణం పెట్టుకుని మర్నాడు బయలుదేరుతాననగా జరిగింది ఆ సంఘటన.

ఆవేళ రాత్రి బర్త్ డే పార్టీకి వెళ్లి వచ్చాం. చిమ్మ చీకటి. చూస్తే నా మీద ఏదో ఆకారం పడి నా పీకే నులుముతోంది. ఊపిరాడలేదు. కాళ్లూ చేతులూ కొట్టుకుంటూ ఆ ఆకారాన్ని తోసివేయబోయాను కానీ నా వల్ల కాలేదు. నా ఆఖరి క్షణాలు దగ్గరపడ్డ ఆ నిమిషంలో ఎక్కణ్నుంచో వచ్చి పడ్డాడు మహేష్. చీకటిలో కూడా పోల్చుకోగలిగాను. వస్తూనే నా మీద పడిన వ్యక్తిని ఒక్క ఊపులో లాగిపారేశాడు. నేను పరుగు పరుగున వెళ్లి లైటు వేసి చూస్తే ఏముంది? నా మీద హత్యాప్రయత్నం చేసింది మా అక్క సవిత!

కేసు నడిచింది. ప్రాసిక్యూషన్ వాళ్లు అక్క పథకాన్ని వివరించారు. సినిమా నిర్మాణంలో డబ్బంతా పోగొట్టుకుని, అప్పులపాలై పోయింది. మా నాన్నగారు నా మీద పెట్టిన ఆస్తిపైన కన్ను పడింది. కట్టుకున్న వాళ్లను చంపి. కేసు పడకుండా తప్పించుకున్న వైకుంఠరావు అక్కరకు వచ్చాడు. తోడుపెళ్లికూతురుగా ఉండాలంటూ నన్ను రప్పించింది. ఆ రాత్రి నన్ను చంపేస్తే ఆ కేసు వైకుంఠరావుమీదే పడుతుంది. సవిత పోలికలు, నా పోలికలు ఒకటే కాబట్టి సవితను చంపబోయి నన్ను చంపేశాడు వైకుంఠరావు అనుకుంటుంది లోకం. పెళ్లి కాగానే ఇన్స్యూరెన్స్ పాలసీ తీసుకోవడం, నా మీద పడ్డప్పుడు జుట్టు కత్తిరించి పారేయడం ఇవన్నీ వైకుంఠరావు మోడస్ ఒపరాండీ కాబట్టి వైకుంఠరావునే ఉరికంబానికి పంపుతారు. నా వారసురాలిగా నా ఆస్తి, వైకుంఠరావు భార్యగా అతని ఆస్తి రెండూ అనుభవించవచ్చు సవిత. మహేష్ సమయానికి వచ్చి కాపాడడంతో ఆమె పాచిక పారలేదు.

"అంతరాత్రివేళ నువ్వు అక్కడేం చేస్తున్నావు?" అని అడిగాను మహేష్‌ని, సవితకు శిక్షపడ్డాక.

"నీ కోసమే. సవిత రూపంతో ఉన్నాననే నీవంటే ఇష్టపడ్డాను మొదట్లో. కానీ పార్టీలో నీ నెమ్మదితనం, అణుకువ చూసి ముగ్ధుడినయ్యాను. నా క్కావలసిన గుణం, రూపం రెండూ ఉన్నాయి నీలో. పెళ్లి చేసుకుంటావా అని అడుగుదామనుకున్నాను. పార్టీలో కుదరలేదు. మీ అక్క.. దగ్గరకు రానివ్వటంలేదు. మర్నాడే నువ్వు ఊరెళ్లిపోతానన్నారు. రాత్రికి రాత్రే నీతో మాట్లాడదామని ఇంటికి వచ్చాను. సవిత లోపలికి రానివ్వలేదు. నిద్రపోయావంది. ఎలాగైనా కలవాలని వాటర్‌పైప్ ఎక్కి మేడమీద బాల్కనీలోకి దూకాను. సరిగ్గా అప్పుడే సవిత నీ మీద పడి పీక నులుముతోంది. ఇంతకీ నన్ను పెళ్లి చేసుకోవడానికి నీకేమైనా అభ్యంతరమా?" అని అడిగాడు మహేష్.

"అక్క కత్తిరించి పారేసిన జుట్టు మళ్లీ పెరిగేదాకా అభ్యంతరమే! ఈ మొండి జడతో పెళ్లిపీటలమీద కూర్చోలేను బాబూ!" అన్నాను నేను.

## 'అబ్బా...ష్‌ష్‌ష్'

సరైన గిరాకీలేక సెకండ్‌హీరోగా చిన్నాచితకా వేషాలు వేయడానికికూడా రెడీ అయిపోయాడు అబ్బాస్. గ్లామర్‌ను పట్టుకుని వేలాడితే ఎంతోకాలం ఇండస్ట్రీలో ఉండేందుకు అవకాశం ఉండదని గ్రహించినట్టున్నా డీయన. అందుకే అడిగిందే తడవుగా ఏ సినిమాలోనైనా చేస్తున్నాడు. తెలుగులో 'అనగనగా ఓ అమ్మాయి', శ్రీనివాసా అర్ట్స్ చిత్రాల్లో నటిస్తున్నా డిప్పుడు.



'నరసింహ'లో రజనీకాంత్‌కు మేనల్లుడుగా నటించినప్పటి అనుభూతిగురించి ఈ కుర్రహీరో ఇలా చెప్పుకొచ్చాడు: "రజనీసార్ అంటే ఎంతమందికో అభిమానం. అలాంటి అభిమానుల్లో నేనూ ఒకణ్ణి. ఆయనతో కలిసి ఫొటో తీయించుకుంటే చాలు అనుకునేవాణ్ణి. అలాంటిది ఆయన సినిమాలో నటించడం మరిచిపోలేను. ఇంతకుముందు నేను చాలా కొద్దిమందికే తెలుసు. కాని, ఈ సినిమాతర్వాత చాలామందికి పరిచయమయ్యాను." రజనీకాంత్ తరువాత సినిమాలోకూడా వేషం కొట్టేద్దామని కాబోలు అబ్బాస్ వ్యూహం.

వల్లి